క్లుప్తంగా

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య


లీలా(ఫైల్)

గణపురం : మండల కేంద్రానికి చెందిన మామిండ్ల లీలా(56) బుధవారం గణపసముద్రం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై మచ్చ సాంబమూర్తి కథనం ప్రకారం లీలా కొన్నేళ్లుగా మతిస్థిమితం కోల్పోయిందని, అనేక సార్లు ఆత్మహత్య చేసుకుంటానని గణపసముద్రం చెరువు వద్దకు వెళ్లేదని చెప్పారు. స్థానికులు గమనించి ఆమెను ఇంటి వద్దకు తీసుకు వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించే వారన్నారు. ఈ క్రమంలో బుధవారం చెరువులో వద్దకి వెళ్లి ఆత్మహత్య చేసుకుందన్నారు. భర్త మల్లికార్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి సివిల్ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

● ఆస్పత్రికి తరలించిన పోలీసులు



కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరిలో మహిళ పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా పోచంపల్లి గ్రామానికి చెందిన బజ్జూరు రామక్క(35) బుధవారం ఉదయం కాళేశ్వరం వద్ద గోదావరిలో పురుగులు మందు తాగి కొట్టుమిట్టాడుతోంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే కాళేశ్వరం ఎస్సై భవానిసేన్, ఏఎస్సై రాజేశం, కానిస్టేబుల్ రమేశ్ ఘటన స్థలానికి చేరుకొని 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. దీంతో గోదావరి నుంచి తీరానికి ఎడ్లబండి ద్వారా ఆమెను హుటాహుటినా పోలీసులు తరలించారు. 108లో మహదేవపూర్‌కు, అక్కడి నుంచి భూపాలపల్లి ఆస్పత్రికి, పరిస్థితి విషమంగా మారడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతోందని ఎస్సై భవానిసేన్ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు చేరుకున్నారు. ఆత్మహత్యయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

పిడుగుపాటుకు ఎద్దు మృతి



మొగుళ్లపల్లి : పిడుగుపడి ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని పిడిసిల్ల గ్రామంలో మంగళవారం జరిగింది. పిడిసిల్ల గ్రామానికి చెందిన గంట రమణారెడ్డికి చెందిన దుక్కిటెద్దు తన వ్యవసాయ క్షేత్రంలో ఉన్న సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో దుక్కిటెద్దుపై పిడుగు పడటంతో అది అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.55,000 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు..

చిట్యాల : విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని గోపాలపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఆరెపల్లి నర్సయ్యకు చెందిన దుక్కిటెద్దు బుధవారం ఉదయం మేతకు వెళ్లింది. కాగా మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షం కారణంగా గ్రామ శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద 11కేవి విద్యుత్ వైరు తెగిపడింది. దీంతో అటుగా వెళ్లిన దుక్కిటెద్దు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు నర్సయ్య తెలిపారు. ఎద్దు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

ఘనంగా బీరన్న నాగవెల్లి

ములుగు : బీరన్న కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆరోరోజు బుధవారం వేడుకలను యాదవులు ఘనంగా నిర్వహించారు. నాగవెల్లి పట్నం వేసి అగ్నిగుండాలు ఏర్పాటు చేశారు. ఉదయం స్వామి వారికి ఇమ్మడి మల్లయ్య ఇంటి నుంచి సందుబోనం, మహంకాళీ బోనం, నాగవెల్లి బోనాలను బైకాని కట్టయ్య, బొంతల రాజు, ఇమ్మడి సమ్మయ్య, ఒజ్జల సాంబయ్య, గొర్రె జంపయ్య, ఇమ్మడి భిక్షపతి, గొర్రె లచ్చు రావులు తీసుకెళ్లి సమర్పించారు. మధ్యాహ్నం ఒజ్జల లింగన్న ఇంటి నుంచి చల్లబాండువాను తీసుకెళ్లి సమర్పించారు. యాదవసంఘం కులపెద్దలు గొర్రె కొంరయ్య, సారిగొల్ల ఇమ్మడి భిక్షపతి, గోపు చంద్రమల్లు, ఎల్లావుల సమ్మయ్య, గుండెబోయిన కుమార్, కొనువుల కుమార్, సంపత్, గోపు శ్రీను, ఇమ్మడి రాజు, రమేష్, బొల్ల రవి, ఒజ్జల లింగన్న, ఎల్లావుల అశోక్, ఒజ్జల కుమార్, ఒజ్జల కళ్యాణ్, బైకాని మధు, కావటి భాస్కర్, బోయిని రాజు, గొర్రె శ్రీను, వంగ రవి తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు


కాళేశ్వరం: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై భవానిసేన్

కాళేశ్వరం : గుర్తు తెలియని, అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని కాళేశ్వరం ఎస్సై భవానిసేన్ అన్నారు. బుధవారం నాగేపల్లి గ్రామంలో కమ్యూనిటి కాంటాక్ట్ నిర్వహించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. అపరిచితులు కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. యువత వ్యసనాలకు, మత్తు పదార్థాలకు బానిస కావొద్దన్నారు. అడవుల్లో వేటాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రలోభాలకు గురికావొద్దని సూచించారు. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

వాజేడు : మండలంలో బుధవారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేశారు.మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. అలాగే చంద్రుపట్ల క్రాస్ రోడ్డు వద్ద పేరూరు ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని పరిశీలించడంతో పాటు బ్యాగులను సోదాలు చేశారు. పోలింగ్ దగ్గర పడుతుడడంతో నగదు తరలింపులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.


వాజేడు: కారును తనిఖీ చేస్తున్న వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు


వాజేడు: ప్రయాణికులతో మాట్లాడుతున్న పేరూరు ఎస్సై రమేశ్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

● రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్


టేకుమట్ల: సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

టేకుమట్ల : కేంద్రం, రాష్ట్రంలో అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు రెండూ ఒకటేనని, వాటికి ఓటేస్తే వృథా అని తెలిపారు. రాముడి పేరుతో రాజకీయం చేస్తూ బీజేపీ కేంద్రంలో పెత్తనం చెలాయించాలని పాకులాడుతుందని మండిపడ్డారు. దేశంలో బడా కాంట్రాక్టర్ల కోసం బీజేపీ పని చేస్తోందని అదానీ, అంబాని వంటి వారికి దేశ సంపదను దోచి పెడుతోందన్నారు. అధికారంలోకి వచ్చాక దేశంలోని నల్లధనాన్ని వెలికి తీసి నిరుపేదల ఖాతాల్లో రూ.10లక్షలను జమ చేస్తామన్న బీజేపీ ఇప్పటి వరకు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో వేల కోట్లను సామాన్యుల నుంచి దండుకుంటున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి కడియం కావ్యను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్‌పాణి, జిల్లా నాయకులు వైనాల రవిందర్, నాంపెల్లి వీరేశం, అప్పం కిషన్, కత్తి సంపత్, దొంతుల శ్రీనివాస్, తిప్పిరెడ్డి క్రిష్టారెడ్డి, వంగ నరేష్, పొలాల సరోత్తంరెడ్డి, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీది కార్పొరేట్ నినాదం

చిట్యాల : బీజేపీది కార్పొరేట్ నినాదమని రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గతంలో బీజేపీది స్వదేశీ నినాదం.. ఇప్పుడు కార్పొరేట్ నినాదమన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బీజేపీతోనే దేశానికి ముప్పు ఉందన్నారు. వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక


రాజుకు కండువా కప్పుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం : బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు, మండలంలోని ధన్వాడకు చెందిన భూపెల్లి రాజు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం మంథనిలో రాజుకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం అని భావించి కాంగ్రెస్‌లో చేరినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు తనవంతు కృషి చేస్తానని రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చిట్యాల : బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మల్లయ్యతో పాటు 40 మంది జిల్లా, మండల నాయకులకు కాంగ్రెస్ కండువ కప్పుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు.

పేదల అభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: పేదల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండలంలోని అందుకుతండా, నైన్‌పాక, జడలపేట, ఒడితల, గోపాలపూర్, చల్లగరిగ, జూకల్, తిర్మలాపూర్, చిట్యాల, నవాబుపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాలనలో బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తే రాజ్యాంగాన్ని మార్చుతారని, రిజర్వేషన్లు మార్చే కుట్ర జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఐదు గ్యారెంటీలను అమలు చేసిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ శాఖ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న సీఐ నరేశ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్ : ఈనెల 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎలక్షన్ నిబంధనలు పాటించాలని భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ అనుసరించి తమ తమ పార్టీ కార్యకలాపాలు నిర్వహించుకోవాలని కోడ్ అతిక్రమించి ప్రవర్తించొద్దని ఆయా పార్టీల నాయకులకు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

బీఆర్‌ఎస్‌తోనే పేదలకు న్యాయం


కాళేశ్వరంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


కాటారం: ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న రాకేశ్

కాటారం : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలిస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ యూత్ విభాగం రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్ అన్నారు. కాటారం మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ పని ప్రదేశాలకు వెళ్లి కూలీలతో ముచ్చటించి ఓట్లు అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పేద ప్రజల సమస్యలు తెలిసిన వ్యక్తి కొప్పుల ఈశ్వర్ అని ఆయనను గెలిపించుకుంటే ఈ ప్రాంత సమస్యలపై పార్లమెంట్‌లో తన గొంతు వినిపిస్తారని పేర్కొన్నారు. అనంతరం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామిళ్ల కిరణ్, జోడు శ్రీనివాస్, పంతకాని సద్వలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి ఈశ్వర్‌ను గెలిపించాలి

కాళేశ్వరం : బీఆర్‌ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీమెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం కాళేశ్వరంలో ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ధాన్యం తూకంలో వేగం పెంచండి

కాటారం: పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో హమాలీ సంఘాల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని 12 కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వెనువెంటనే పూర్తి చేయాలని సూచించారు. వర్షాభావ సూచనలు ఉన్నందున హమాలీల సంఖ్య పెంచుకొని రోజుకు వీలైనంత ఎక్కువ కాంటాలు పెట్టాలన్నారు. కేంద్రాల్లోని ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు లోడ్ చేసి కెటాయించిన మిల్లులకు పంపించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, డైరెక్టర్లు దండ్రు రాజయ్య, సీఈఓ ఎడ్ల సతీశ్, హమాలీ సంఘాల నాయకులు లింగయ్య, బుచ్చయ్య, మల్లయ్య, సమ్మయ్య, శ్రీనివాస్, రాజేందర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల విస్తృత ప్రచారం


గోవిందరావుపేట: దుంపెల్లిగూడెంలో ఓట్లు అడుగుతున్న నరసింహ నాయక్


ఏటూరునాగారం: చిన్నబోయినపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గోవిందరావుపేట : మండల పరిధిలోని దుంపెల్లి గూడెం, ప్రాజెక్ట్ నగర్ గ్రామాల్లో బుధవారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్, ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా నరసింహ నాయక్ దుంపెల్లిగూడెం గ్రామంలో రైతులను, హమాలీలను కలిసి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రాజెక్ట్ నగర్‌లో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాలోత్ కవిత కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా లకావత్ నరసింహ నాయక్, సూడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే కరెంట్ కోతలు, తాగునీటి సమస్యలు తలెత్తయన్నారు. సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో రైతులకు సకాలంలో రైతు బంధు, రుణమాఫీ, నిరంతరం విద్యుత్ ఇచ్చామని గుర్తు చేశారు. ఓటర్లంతా కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెట్ అభ్యర్థి మాలోత్ కవితను అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీటీసీలు వెలిశాల స్వరూప, లావుడ్య రామచందర్, సూదిరెడ్డి లక్ష్మారెడ్డి, చందులాల్, గ్రామ కమిటీ అధ్యక్షులు వాసం శివాజీ, నర్సి రెడ్డి, ఐలయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్ల కుటుంబాలు

ఏటూరునాగారం : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్ సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ అన్నారు.బుధవారం మండలంలోని చిన్నబోయినపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేపట్టగా ఆటో డ్రైవర్ల అధ్యక్షుడు పెంచికల లక్ష్మీనారాయణ డ్రైవర్ల ఆవేదనను వెలిబుచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపకపోవడంతో తాము నష్టపోతున్నామని అన్నారు. ప్రతిరోజు ఆటో నడుపుకొని బతికే తమకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సునీల్ కోరారు. సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుజ్జేటి రాజశేఖర్, వావిలాల రాంబాబు, రాజు, ఫత్తె మహ్మద్, ఆడెపు వెంకటేష్, మాచర్ల శ్రీనివాస్, సతీష్, రామకృష్ణ, చిరంజీవి, మెట్టు రవి, ఠాగూర్, శివ, రతన్ సింగ్, జితేందర్ సింగ్, జగదీష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన కాళేశ్వరం దేవస్థానం మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్, ప్రస్తుత కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గంట రాంనారాయణగౌడ్ బీఆర్‌ఎస్ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేసినట్లు ప్రకటనలో తెలిపారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్ పార్టీలో పని చేశానని, అనివార్య కారణాలతో పార్టీకి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

ఎన్నిక



మొగుళ్లపల్లి : మండలంలోని వేములపల్లి గ్రామంలో పద్మశాలి సంఘం ఎన్నికను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా తాటిపాముల కేదారి, ఉపాధ్యక్షుడిగా ఎలగొండ రాజు, ప్రధానకార్యదర్శిగా బూర మొగిలి, కోశాధికారులుగా మాచర్ల వేణు, ఆడెపు ప్రతాప్‌ను ఎన్నుకున్నారు. బూర రాజకుమార్, కుసుమ భిక్షపతి, కుసుమ రవి, మునుకుంట్ల సమ్మయ్య, శంకరయ్య, మొగిలి, సమ్మయ్య, శ్రీరామ్ కిష్టయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

ఏటూరునాగారం : మండలంలోని బూటారం గ్రామం వద్ద విద్యుత్ వైర్ తెగిపడడంతో ఎక్కెల గ్రామానికి చెందిన చల్ల దేవరాజ్‌కు చెందిన గొర్రె అక్కడికక్కడే మృత్యువాత పడింది. మేత కు వెళ్లిన గొర్రె రాకపోవడంతో వాటిని వె తుక్కుంటూ వెళ్లగా బూటారం సమీపంలో పొలంలో మృతి చెంది ఉందని బాధిత రైతు దేవరాజ్ తెలిపాడు. రూ.10వేల వరకు నష్టం వాటిల్లిందని, పరిహారం ఇప్పించాలని వేడుకున్నారు.

అడవిలో మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తమాషారెడ్డి

పలిమెల : మండలంలోని బండారిగూడెం అటవీ ప్రాంతంలో యాచకుడి మృతదేహం గుర్తించినట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పేరికెడు గ్రామానికి చెందిన గందం రాజేష్ మతిస్థిమితం సరిగ్గా లేదు. అయితే పలిమెల మండలంలోని ముకునూర్ గ్రామం నుంచి బండారిగూడేనికి నడుచుకుంటూ వెళ్లగా ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురయ్యాడు. కాగా తన అక్క అయిన సరోజనతో మూత్ర విసర్జనకు అని చెప్పి అటవీ ప్రాంతంలోకి వెళ్లి అక్కడే స్పృహ తప్పి పడిపోయి మృతిచెందాడు. మృతుడి అక్క సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

దేశాన్ని రక్షించుకోవాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: మోదీ నియంతృత్వ పాలన నుంచి దేశాన్ని రక్షించుకోవాలని ఇండియా కూటమి నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు దేశంలో 26 పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడి ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తున్నాయన్నారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ పార్టీలను చిత్తుగా ఓడించి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కడియం కావ్యను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కులమతాలను రెచ్చగొట్టి వేరు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం కూటమి గ్యారంటీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల జిల్లా కో ఆర్డినేటర్ మార్క విజయ్ కుమార్, టౌన్ అధ్యక్షుడు రమేష్, తక్కళ్ళపల్లి రాజు, రఫీ, అప్పం కిషన్, పున్నం చందర్‌రావు, మండ రవి, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీహరి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఎండీ రాజ్ మహ్మద్, కుమారస్వామి నిమ్మల రాజయ్య, ఎండీ నబీ, భద్రయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి

● మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి


మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తోందని, మాయమాటలు చెప్పి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఇప్పటీ వరకు ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటితే కేంద్రంలో చక్రం తిప్పే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పతనవేని ఐలయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, మాజీ ఎంపీపీ బందెల నరేష్, నాయకులు ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.